# హత్యా రాజకీయాలకు తెర లేపిన కాంగ్రెస్

- మరోసారి ఆదరించండి
- అచ్చంపేట ప్రజల కోసమే జీవిస్తా
- విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- గెల్వలాంబ మాతకు ప్రత్యేక పూజలు
- కాంగ్రెస్, బీజేపీ నేతల చేరికలు


వంగూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

వంగూరు, నవంబర్ 2 : ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలను ఎదుర్కోలేని కాంగ్రెస్ హత్యా రాజకీయాలకు తెర లేపిందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మండల కేంద్రంలోని గెల్వలాంబ మాత ఆలయంలో బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను అమ్మవారి వద్ద ఉంచి బీఆర్‌ఎస్ నేతలతో కలిసి విప్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వంగూరులో ఎన్నికల ప్రచారం చేపట్టి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను ఓటర్లకు విప్ గువ్వల వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా బిచ్చగాడు రేటేంతరెడ్డి మండలానికి వస్తే ఇక్కడి ప్రజలు కనీసం కన్నేత్తి కూడా చూడలేదని ఎద్దేవా చేశారు. కొంత మంది నా వెంట ఉంటూ ఇసుక దందా చేస్తామంటే నేను వద్దన్నందుకు పార్టీ మారిన స్వార్థపరులన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇటీవల దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేశారని, హత్యలు చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని మండిపడ్డారు. మీరే నా శ్వాస, మీరే నా ధ్యాస, ఎల్లవేళలా అచ్చంపేట ప్రజల కోసమే జీవిస్తానని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారుకు ఓటేసి హ్యాట్రిక్ విజయాన్ని అందించి అసెంబ్లీకి పంపాలని విప్ గువ్వల కోరారు. అనంతరం పోల్కంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు సందీప్, సాయికుమార్‌గౌడ్ విప్ గువ్వల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, ఎంపీపీ భీమమ్మాలాలుయాదవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, హామీద్,రాజేందర్‌రెడ్డి, గణేశ్‌రావు, నరేందర్‌రావు,భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### మరోసారి ఆదరించండి

చారకొండ/లింగాల, నవంబర్ 2 : మండలంలో అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ప్రజలు ఆదరించాలని విప్ గువ్వల బాలరాజు కోరారు. గురువారం మండలంలోని సిరుసనగండ్ల, చారకొండ గ్రామాల్లో ఎంపీపీ గుండెనిర్మలావిజేందర్‌గౌడ్ ఆధ్వర్యం లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకముందు అపర భద్రాదిగా పేరుగాంచిన సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నిక ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ గువ్వల మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల మధ్యలోనే ఉంటూ నిరంతరం ప్రజాసేవ కోసం పాటుపడ్డానని అన్నారు. అనంతరం చారకొండ, సిరుసనగండ్లలో పలువురు కాంగ్రెస్, బీజేపీ, యాదవ సంఘం నాయకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గురువయ్యగౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు గజ్జెయాదయ్యగౌడ్, ఎంపీటీసీలు లక్ష్మణ్‌నాయక్, లలితాబాల్‌సింగ్, సర్పంచులు యాతంశ్రీను, ప్రశాంత్‌నాయక్, నరేశ్‌నాయక్, అనిశెట్టిశ్రీను, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, యువజన నేతలు అల్వాల్ నవీన్‌గౌడ్, కేశమోని మధుగౌడ్‌తోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. లింగాల మండలంలోనూ గువ్వల ఎన్నికల ప్రచారం నిర్వహించి మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు.

# రాజకీయ దురుద్దేశంతోనే రాహుల్ వ్యాఖ్యలు

- చనిపోయిన మూడేండ్లకు రైతు కుటుంబం గుర్తుకొచ్చిందా
- తాడు, బొంగరం లేని వారికి కుటుంబాల విలువ తెలుసా
- కాంగ్రెస్ నేతల తీరుపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


కల్వకుర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, నవంబర్ 2 : తాడు బొంగరం లేని రాహూల్‌గాంధీకి కుటుంబాల విలువ ఎలా తెలుస్తుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రచార కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి వచ్చిన ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను గురువారం కల్వకుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఖండించారు. మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యంతో కలిసి ఆయన మాట్లాడుతూ జిల్లెళ్లలో మూడేండ్ల కిందట రైతు ఎగిరిశెట్టి చంద్రయ్య ఆత్మహత్య చేసుకొని మరణించాడు. గతంలో రెం డు సార్లు చంద్రయ్య ఆత్మహత్య ప్రయత్నాలు చేశారు. దురదృష్టవశాత్తు మూడోసారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాలు కోల్పోయాడు. చంద్రయ్యకు 28గుంటల పొలం ఉంది, రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని పత్తి సాగుచేశారు. ఇంత వరకు అందరికీ తెలిసిందే. విషయానికి వస్తే అప్పుల బాధతో చంద్రయ్య చనిపోలేదు. సాగుచేసిన రెండెకరాల్లో పత్తి దిగుబడి బాగానే వచ్చింది. వ్యక్తిగత కారణాలతో చనిపోతే మూడేండ్ల తరువాత కాంగ్రెస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం అప్పులబాధ అంటూ రాజకీయాలు చేస్తారా అంటు ఎమ్మెల్యే మండిపడ్డారు. చంద్రయ్య చనిపోయిన వారం రోజుల వ్యవధిలోనే బాధిత కుటుంబానికి రూ.5లక్షల రైతు బీమా వచ్చింది. చంద్రయ్య భార్య తిరుపతమ్మకు వితంతు పింఛన్ మంజూరైంది. మూడేండ్లుగా చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించని ఏఐసీసీ, పీసీసీ, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు రాజకీయాలు చేసి, అవాకులు చెవాకులు పేల్తారా అంటు విరుచుకుపడ్డారు. పట్టుమని పది పైసలు కూడా సాయం అందించని వాళ్లు.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు.

### తాడు బొంగరం లేని వ్యక్తి రాహుల్..

సంప్రదాయం, సిద్ధాంతమంటూ లేకుండా నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్న రాహూల్‌గాంధీకి కుటుంబాల విలువ ఏం తెలుసని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తాడు బొంగరం లేని రాహుల్‌గాంధీ రాత్రయితే ఏ దేశం పోతాడో ఎవరికీ తెలియదని, అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి గురించి మాట్లాడితే తెలంగాణ సమాజం తిరగబడుతుందని ఎమ్మెల్యే హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వసుందని పగటి కలలు కంటున్నారని.. అవన్నీ కలలుగానే మిగులుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడో సారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వసుందని, 105 సీట్లు గెలిచి ముఖ్యమంత్రిగా కేసీఆర్ మూడో సారి పాలన సాగించబోతున్నారని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరెడ్డి అక్రమంగా సంపాదించిన డబ్బులతో బీఆర్‌ఎస్ నాయకులను సంతలో పశువులను కొనుగోలు చేసినట్లు కొనుగోలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎవరెన్నీ కుట్రలు చేసినా కల్వకుర్తిలో బీఆర్‌ఎస్ విజయాన్ని ఏశక్తి అడ్డుకోలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, కౌన్సిలర్లు సూర్యప్రకాశ్‌రావు, సర్పంచుల సంఘం మండలాధ్యక్షులు జంగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలయ్య, చెన్నకేశవులు, కిశోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం..

వెల్దండ, నవంబర్ 2 : మండలంలోని కొట్ర, చొక్కన్నపల్లి, తిమ్మినోనిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చొక్కన్నపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. గ్రామంలో మహిళలు, వృద్ధులతో ప్రత్యేకంగా మాట్లాడి ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, రైతుబంధు సమితి అధ్యక్షుడు భాస్కర్‌రావు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లోకి వలసల పర్వం

ఇటీవల రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వెల్దండ మాజీ ఎంపీపీ పుట్టా రాంరెడ్డి కొంత మంది నాయకులు తిరిగి గురువారం చొక్కన్నపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గాన్‌గట్టుతాండకు చెందిన ఉప సర్పంచ్ మారుతి రమేశ్‌తో పాటు మరో 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు.


గంగారం గ్రామస్తులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

# నాగంను కాంగ్రెస్‌అవ మానించింది

- బీఆర్‌ఎస్‌లోకి హృదయ పూర్వకంగా స్వాగతం పలుకుతున్నాం
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ ఉనికి కోల్పోయింది : మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమంలో ప్రజాప్రతినిధిగా సేవలందించిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అవమానం జరిగిందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రోజుకో పార్టీ మారే నాయకులకు టికెట్ ఇచ్చి నాగంకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్యాయం చేశారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతో పోరాడిన నాగంను బీఆర్‌ఎస్ పార్టీలోకి హృదయ పూర్వకంగా స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. నాగం మార్గదర్శకంలో పని చేస్తామని, 90శాతం మంది నాగం వద్ద ఎదిగిన నాయకులే అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలోకి ఎప్పుడో రావాల్సి ఉండేదని, ఆలస్యంగా అయినా బీఆర్‌ఎస్‌లో చేరడం శుభసూచకమన్నారు. నాగం ఒక ప్రాంతానికి చెందిన నాయకులు కాదని, రాష్ట్ర ఉద్యమం చేసిన సుధీర్ఘ అనుభవం ఆయనకు ఉందన్నారు. అదేవిధంగా మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మర్రి జనార్దన్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. 1983 నుంచి ఇప్పటివరకు నియోజకవర్గంలో ప్రతి ఇంటి ఓటు పడిందని, ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించిన ప్రజల మేలు మర్చిపోలేనన్నారు. కాంగ్రెస్ పార్టీ 30 ఏండ్ల నుంచి ఉనికి కోల్పోయిందని, అలాంటి పార్టీని బిజినేపల్లి సమావేశంతో నిలబెట్టానని తెలిపారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎన్ని మండలాలు, ఎన్ని గ్రామాలు ఉన్నా యో ఎంత మంది ప్రజలు ఉన్నారో, ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలియదన్నారు. అలాంటి రాజేశ్‌రెడ్డి ఎలా పోటీ చేస్తాడని ప్రశ్నించారు. కూచకుళ్ల ఎలాంటి గుర్తింపు లేదని, రేవంత్ ఫేక్ సర్వేతో పాపులారిటిలో నేను నెంబర్ 10 అన్నారు. ప్రజలను మోసం చేసే కూచకుళ్లకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. గుడ్డిగా దరఖాస్తు చేయని 30 మందికి కాంగ్రెస్‌లో టికెట్లు ఇచ్చారన్నారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం మంచిగా అమలు జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్, రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయంలో తలమానికంగా మారిందన్నారు. కాంగ్రెస్‌తో 30 ఏండ్లు కొట్లాడా, బీఆర్‌ఎస్‌తో పదేండ్ల రాజకీయ వైరం ఉందని, సీఎం కేసీఆర్ నేను క్లోజ్ ఫ్రెండ్స్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి దూరంగా ఉన్న శ్రేణులు కలిసిపోయేలా కృషి చేస్తానన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి గెలుపునకు అన్ని విధాలుగా కృషి చేస్తానని ప్రకటించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బైకని శ్రీనివాస్ యాదవ్, నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌లోకి నాలుగు గ్రామాల ప్రజలు

నాగర్‌కర్నూల్, నవంబర్ 2: ప్రభుత్వం చేపడుతున్న చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులూ బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లి, గంగారం, అల్లీపూర్ గ్రామాలతోపాటు తెలకపల్లి మండలం చిన్నముద్దునూర్, పెద్దపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు భారీగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే మర్రి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమం బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

# కొల్లాపూర్‌పై గులాబీ జెండాను ఎగురేద్దాం

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

కొల్లాపూర్, నవంబర్ 2 : ఈనెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కొల్లాపూర్ కోటపై గులాబీ జెండాను ఎగురేద్దామని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి జూపల్లిని ఓడించి శాశ్వతంగా ఇంటికి పంపుదామని,పార్టీ శ్రేణులు సైనికులుగా పనిచేస్తూ ప్రజలను సన్నద్ధం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఆ పార్టీ నాయకుడు చంద్రశేఖరాచారి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భం గా ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ గత 19 ఏళ్లుగా ఎమ్మెల్యే గా,అనేక మంత్రి పదవులను చేసి నియో జకవర్గానికి ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నిం చారు. ప్రజలను ఓటు అడిగే హక్కు వారికి లేదని,ఆ హక్కు ఒక్క బీఆర్‌ఎస్ పార్టీకే ఉందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పట్టణానికి చెందిన 130 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సాయిరాంయాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావుతోపాటు పలువురు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### భారీగా చేరికలు

పెద్దకొత్తపల్లి/పెంట్లవెల్లి/వీపనగండ్ల, నవంబర్ 2 : మండలంలోని మరికల్, బాచారం, నారాయణపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 300మంది కార్యకర్తలు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా పెంట్లవెల్లి మండలం మంచాలకట్టకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు సులిగిరి నాగరాజు, చింతలగారి నారాయణలతోపాటు మరో 10 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీపనగండ్ల మండలంలోని వల్లభాపురం తండాకు చెందిన గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌నాయక్, కార్యదర్శి శివుడునాయక్‌తోపాటు వెంకటేశ్, రాజు, బాబు, శివుడు, రాము, శ్రీను, లాలు, సోమ్లా నాయక్‌తో కలిసి బీరం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.